
1/7/90

# తుషార నేత్రం!



అశోక్ వి.కె.

**కలలు ఘనీభవించిన వేళ...**
**కనులునీరై కరిగిన దృశ్యం!**

ఆరోజు శ్మశానం ప్రశాంతంగానే ఉంది. పిచ్చిచెట్లు గాలికి వంగి స్వాగతం పలుకుతున్నాయ్. సమాధుల పై శిలువలు ధైర్యంగా నిల్చొని ఉన్నాయి. సమాధిలోని నిర్జీవాలకు కాపలాకాసే సైనికుల్లా.

ష్శ్... అబ్బా

కాలికి రాయితగిలింది.

పాదురాయి, గట్టిగా తన్నా.

శ్... అబ్బో... అమ్మో.. ఇంకా నొప్పెడుతోంది.

ఇంత చిన్నరాయి తగిలితేనే ప్రాణంపోయేంత బాధగా ఉంది... మరి ఆరోజు లూసీ...

...అలసిన దేవేరి

అలసిన దేవేరి అలమేలు మంగకూ...

తెలవారదేమో స్వామి

గమపదని

తెలవారదేమో స్వామి...

'ఎంత మధురంగా ఆలపించావమ్మా లూసీ, అన్నమాచార్య కీర్తనని ఇంత మధురంగా ఆలపించావంటే ధన్యురాలవమ్మా'

మా సంగీతంమాస్టారు అన్న ఆ మాటలు లూసీమీద కన్నా నామీద బాగా పనిచేశాయి. ఆ ధన్యురాలి ప్రేమని పొందగలిగితే నేను ధన్యుడ్నే.

పగలనక రేయనకా ప్రేమపాఠాలు నేర్చుకొని లూసీ మీద ప్రయోగించాను. నా ప్రయోగాలు ఫలించి లూసీ ప్రేమకి దగ్గరయ్యాను.

సాయంత్రం మూడుగంటల నుండి ఐదుగంటల వరకూ సంగీతంక్లాస్. క్లాస్ అయిపోగానే గట్టువతలి రామాలయం ప్రతిరోజూ మాకు విడిదినిచ్చేది.

ఎన్నో పిచ్చి కబుర్లు

చూపులతోనే ఊసులు

నిశ్శబ్దంగా మాటలు

గంటలు క్షణాలు...

ప్రేమపాశం అంటే ఇదేనేమో

దూరంగా ఉంటే క్షణం యుగం ఐపోతుంది...

ఆరవ్వగానే

'డాడీ గొడవచేస్తారు నే వెళ్తా వేణు' అంటూ చెయ్యి ఊపుతూ దూరమయ్యేది. ఆ క్షణంనుండి మరుసటి రోజు మూడుగంటల వరకు చకోరపక్షిలా నిరీక్షణం.

ఆరోజు లూసీ వేషం చూస్తే మతిపోయింది. ఫారిన్ నుండి దిగివచ్చిన దేవకన్యలా మ్యాక్సీ డ్రెస్, గాలిలో తేలుతూ హెయిర్, కళ్లకి అందమైన గాగుల్స్. ఆ మేకప్‌లో లూసీ గమ్మత్తయిన అందంతో కన్పించింది.

'ఏమిటే గెటప్' అడిగాను.

'వెస్ట్ జర్మనీనుండి మా కజిన్ వచ్చింది. ఆవిడ గెటప్‌ని యాజిటీజ్‌గా నే వేస్కొచ్చేశాను, ఎలా ఉంది'

'ఏమోగానీ ఈ గాగుల్స్ మాత్రం చాలా బాగున్నాయి' అంటూ తీసుకొని నా కళ్లకు పెట్టుకున్నాను.

'ఎలా ఉన్నాయ్'

'నైస్, ఈ గాగుల్స్‌లో కౌబాయ్‌లా ఉన్నావ్'

'థాంక్యూ.. థాంక్యూ..' గాగుల్స్ తీసి లూసీకి ఇస్తూ

'నాకేదైనా ఉద్యోగంవస్తే ఇలాంటి గాగుల్స్ కొంటాను'

'ఏ... అంత నచ్చాయా?!'

'ఊ'

'అక్కడ దగ్గర కొట్టేయనా?'

'నో వద్దు. తప్పు'

* *** *

జోరుగా వర్షం. చీకటిచీకటికి మధ్య ఉరుములు, మెరుపులు.

కిటికీలోంచి బయటకు చూస్తున్న నాకు దూరం నుంచి ఓ ఆకారం పరుగెట్టుకుంటూ ఇటే వస్తుంది. మెరుపువెలుతురులో తెలిసింది అతను ప్రకాష్.

తలుపుతీశాను. రొప్పుకుంటూ లోపలికొచ్చాడు.

'ఏంటి ఈ టైమ్‌లో ఇలా'

'నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి వేణు'

'ఏమిట్రా'

'లూసీ ఈ మధ్య విక్టర్‌తో తిరుగుతోంది'

'......'

'అవును. నేను కళ్లారా చూశాను. వాళ్లిద్దరూ రాత్రుళ్లుకూడా...'

... ...

'అబద్ధమనుకుంటున్నావా— కాదు నిజంగా. లేకపోతే ఇంత రాత్రిపూట ఈ వర్షంలో వచ్చిచెప్పాల్సిన అవసరం ఏముంది. కావాలంటే నాతోరా ఇప్పుడే చూపిస్తా'

నేనేమీ మాట్లాడలేదు. వాడేమనుకున్నాడో ఏమో వెళ్లిపోయాడు.

గాలికి కిటకీతలుపు కొట్టుకొని దభేలుమని శబ్దం.

మనసంతా మంచులా...

ప్రకాష్ చెప్పింది నిజమేనా, ఛీ... నా ప్రాణాతిప్రాణమైన లూసీ నన్ను అన్యాయం చేయదు. ఏమో... చేసి ఉంటుందా?.. ఓ ప్రశ్నార్థకం. నా మనసంతా ఆక్రమించుకుంది. సమాధానంకోసం ఆ వర్షంలోనే లూసీ ఇంటివైపుకు బయలుదేరా.

రోడ్డంతా రొచ్చురొచ్చు.

మధ్యమధ్య మెరుపులుతప్ప ఆ ప్రాంతమంతా చిక్కనిచీకటి.

లూసీ బెడ్‌రూమ్ లైట్ వెలుగుతోంది. కిటికీ గుండా కన్పిస్తోంది. రెండు ఆకారాలైతే ఉన్నాయి.

ఆ ఇంటిలో ఉండేది ఇద్దరే. లూసీ, వాళ్ల ఫాదర్.

కొంచెం దగ్గరగా వెళ్లాను— బురదలో పాతుకున్న కాళ్లను గుంజుకుంటూ.

ఎస్, విక్టర్.. విక్టరే అతను

ఇంత రాత్రిపూట ఈ సమయంలో లూసీ అతనితో ఉందంటే... నో డౌట్!

నిస్సారమైన నా శరీరాన్ని ఎలాగోలా ఈడ్చుకుంటూ నా రూమ్‌లో పడేశాను.

నిద్రపట్టలేదు. ఆకలిగా ఉంది.

బ్రెడ్ తిందామని ప్రయత్నించాను. సహించలేదు.

నిద్రలేని నా ఆలోచనలతో పాటు తెల్లవారింది.

సంగీతంక్లాస్‌కి వెళ్లాను. లూసీ ఇంకా రాలేదు. నిన్నటి ఘటన తాలూకు ఆలోచనలు చింపేసిన కాగితపు ముక్కల్లా నా మనో ఆకాశంలో ఎగురుతున్నాయి.

'హాయ్! వేణు'

కళ్లులోతుగా పోయి, మొహమంతా కాంతిహీనంగా ఈమె లూసీ కాదేమోనన్నట్లుంది. గాత్రంతా నిద్రలేదేమో, 'పాపం' ఎంత అలసిసొలసి పోయిందో..

'ఏయ్ ఏంటి మాట్లాడవ్'

నా ఆలోచనల్ని కుదుపుతూ అడిగింది.

'ఏంలేదు. ఏంటి అంత డల్‌గా ఉన్నావ్' అడిగాను.

'ఏంలేదు.. ఏం.. లేదు' తడబాటుగా సమాధానం.

'అవును— వేణు రేపు సండే నీ బర్త్‌డే కదా—పార్టీ గీర్టీ ఏం లేదా' మాటమారుస్తూ అడిగింది.

'నో పార్టీ నథింగ్' కాస్త అసహనంగానే చెప్పాను.

'ఏమ్మా ఎందుకంత కోపం వేణుగోపాలా— సర్లే మా ఇంట్లోనే నీకు పార్టీ ఎరేంజ్ చేస్తా! ఓ.కే'

నా సమాధానం ఏమీవినకుండానే

'సండే. టెన్ వో క్లాక్ ఓ.కే' అంటూ క్లాస్‌కి ఎటెండ్ కాకుండానే చకచకా వెళ్లిపోయింది.

'జీవితంలో నటించడం చాలాకష్టం. లూసీ ఎంత ఈజీగా నటిస్తోంది!' నాకు తెలీకుండానే దవడకండరం బిగుసుకుంది.

ఆదివారం వచ్చింది. కొత్త డ్రెస్ వేసుకొని బయలుదేరాను. ఊరు ఇంకా పూర్తిగా నిద్రలేచినట్లు లేదు. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయ్.

లూసీ ఇల్లు చేరాను.

బజర్ నొక్కాను. లూసీ వచ్చి తలుపు తీసింది.

'హాపీ బర్త్‌డే టూ యూ డియర్ వేణూ'

తలెత్తి చూశాను. కడిగిన ముత్యంలా నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంది లూసీ. ఇప్పుడే స్నానం చేసినట్లుందేమో, ఆమెనుండి చల్లని పరిమళం ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగరేసి మనసారా ముద్దాడాలని మనసు తపన.. 'వద్దు' మనసు మరోవైపు హెచ్చరిక.

'కమిన్ వేణూ'

లోపలికెళ్లాను.

'ఫాదర్ లేరా'

'లేరు చర్చికెళ్లారు' లూసీ చెప్పింది.

'హావ్ దిస్ కేక్' చేతికి అందించబోయాను కేక్ ముక్క

'హు.. నోట్లో పెట్టవా' గోముగా, గారాంగా అడిగింది.

నా చేతులతో నేనే కేక్‌ముక్కని లూసీ నోటికి అందిస్తుంటే నా చేతులు సన్నగా వణికాయి.

'మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే— వన్ మినిట్ ఇప్పుడే వస్తా'నంటూ లోపలికెళ్లింది లూసీ. ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా వణుకుతున్న శరీరంతో వేగంగా బయటపడ్డాను.

మధ్యాహ్నం అయింది. కిటికీలోంచి చూస్తున్న నాకు ఎదురుగా శూన్యమే కన్పిస్తోంది. శూన్యాన్ని ఛేదిస్తూ నా రూమ్ ఎదురుగా రోడ్డుమీద ఓ పోలీస్ వాన్ ఆగింది. నా గుండె ఆగింది... మళ్లీ ఆడుతోంది. వాన్ దిగి నా రూమ్‌వైపుకి నడిచి వస్తున్నాడు విక్టర్.

'విక్టర్! ఏమిటిది'

'లూసీ చనిపోయింది. కాదు ఎవరో చంపారు. ఎవరు చంపారో నాకు తెలీదు. పోలీసులు నేనే చంపానని నన్ను అరెస్టుచేశారు.

ప్రొద్దుట లూసీ ఇంటికి వెళ్లేసరికి తను చావుబ్రతుకుల మధ్య కొట్టుకులాడుతోంది. తన చివరి కోరికగా ఈ గాగుల్స్ నీ బర్త్‌డే గిఫ్ట్‌గా ఇవ్వమని కోరింది.

ఈ గాగుల్స్ కొనడానికి రాత్రి పగలు బైబిల్ కథలు ట్రాన్స్‌లేట్ చేసి చాలా కష్టపడింది. తనకు ట్రాన్స్‌లేట్ చేయడంలో సహాయం చేసినందుకేమో నాకీ శిక్ష.

నీకీ గాగుల్స్ చూపించి సర్‌ప్రైజ్ చెయ్యాలని ఎంత ఆశపడిందో పాపం లూసీ—

ఇక వెళ్తున్నా' అంటూ గబగబా వెళ్లి వాన్ ఎక్కాడు. వాన్ కదిలింది. దూరంగా దాన్ని శూన్యం మింగేసింది.

స్మృతి కరిగింది.

వాస్తవం వాయుగుండమయింది.

మనోసీమలో ఆలోచనలు, అనుభూతులూ కూలిపోతున్నాయ్.

కనుల కొలను చెలియలికట్ట దాటి లూసీ సమాధిని చేరింది.

పక్కనే గడ్డిపరకల మధ్య మంచుబిందువులను స్పర్శిస్తున్న నీరెండ నా కన్నీటి బిందువుల్ని కనీసం కన్నెత్తయినా చూడలేదు!